

## ప్రధాని మాట్లాడాలంటూ ప్రతిపక్షాల పట్టు.. రాజ్యసభ నుంచి వాకౌట్..!

వర్షా కాల సమావేశాల్లో 'ఆపరేషన్ సిందూర్'పై చర్చలతో పార్లమెంట్ అట్టుడుకుతోంది. లోక్ సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఇతర పార్టీల ఎంపీల వ్యాఖ్యలకు దీటుగానే బదులిచ్చిన ప్రధాని బృందం రాజ్య సభలోనూ అదే ధోరణి అవలంభించాలనుకుంది. అయితే.. ప్రతిపక్షాలు మాత్రం రాజ్య సభలో కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించాయి. బుధవారం చర్చ సందర్భంగా హోం మంత్రి అమిత్ షాకు ప్రతిపక్ష నాయకుల మధ్య మాటల యుద్ధం సాగింది. ప్రధాని మోడీ సభకు వచ్చి మాట్లాడాలని కాంగ్రెస్, ఇతర విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. అయితే అందకు తిరస్కరించిన షా ప్రధాని అన్ని విషయాలు సవివరంగా చెప్పారని బదులిచ్చారు. దాంతో, ఆగ్రహించిన కాంగ్రెస్, సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.


# చట్టం

సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

నిజామాబాద్
గురువారం
31.07.2025

సంపుటి : 15 సంచిక: 319
పేజీలు: 7 వెల: రూ.5

ఎడిటర్ : సిరిగాద ప్రసాద్


## లింగాపూర్ గ్రామ అభివృద్ధి కోసం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రికి వినతి



**చట్టం రామగుండం :** బిజెపి రామగుండం నియోజక వర్గ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి పోచం లు ఢిల్లీలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కార్యాలయంలో జి. కిషన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా లింగాపూర్ గ్రామ అభివృద్ధి కోసం తగిన నిధులను కేటాయించే విధంగా కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు అయిన ఎన్టీపీసి, సింగరేణి సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని మంత్రి ని కోరారు.ప్రభావిత గ్రామమైన లింగాపూర్ కు చెందిన ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ఎన్టీపీసి సంస్థ ద్వారా లింగాపూర్ నుండి గోదావరి పంప్ హౌస్ వరకు సు 3 కిలోమీటర్ల సీసీ రోడ్డు దానికి ఇరువైపులా సైడ్ డ్రైన్స్ నిర్మించే విధంగా ఎన్టిపిసి సంస్థ కి ఆదేశాలు ఇవ్వాలని,అలాగే సింగరేణి సంస్థ ద్వారా లింగాపూర్ నుండి మేడిపల్లి ఒసిపి 4 వరకు సీసీ రోడ్డు నిర్మించేందుకు సింగరేణి సిఎండి హైదారాబాద్ కి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు.ఈ రహదారి ద్వారా సుమారు 17 గ్రామాల మత్స్యకారులు గోదావరి గంగలో చేపల వేట కోసం ప్రయాణించేందుకు, అలాగే 17 గ్రామాల ప్రజలు పుణ్యస్నానాలు, కర్మకాండలు నిర్వహించేందుకు ఇది ప్రధాన మార్గమని ఆమె వివరించారు. లింగాపూర్ గ్రామ అభివృద్ధికి ఎన్టీపీసి, సింగరేణి సంస్థల సహకారం అవసరమని, దీనికి మీరు సహకరించాలని మంత్రి ని రామగుండం బీజేపీ ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ఈ సందర్భంగా కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు.

## బీసీ బిల్లుల కోసం ఎమ్మెల్సీ కవిత

# 72 గంటల నిరాహార దీక్ష



### పోస్టర్ ఆవిష్కరణ

**చట్టం నిజామాబాద్:** బీసీ బిల్లుల సాధన కోసం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఇందిరా పార్క్ వద్ద చేపట్టనున్న 72 గంటల నిరాహార దీక్ష పోస్టర్‌ను బుధవారం బంజారా హిల్స్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఆగస్టు 4వ తేదీ ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 7వ తేదీ ఉదయం 10 గంటల వరకు 72 గంటల పాటు నిరాహార దీక్ష చేస్తానని వెల్లడించారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ (యూనైటెడ్ ప్రోగ్రెసివ్ ఫోరం) ఆధ్వర్యంలో ఈ దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ఆమె మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీ, కౌన్సిల్ ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం తెలుపకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు న్యాయపోరాటం చేయడం లేదని కవిత ప్రశ్నించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదని, పోరాటం కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. కాగా, కవిత చేపట్టబోయే 72 గంటల నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తెలంగాణ జాగృతి నాయకులు సెంట్రల్ జోన్ డీసీపీకి దరఖాస్తు లేఖను అందజేశారు.

## మెదక్ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి



- కలెక్టర్ రాహుల్ రాజ్

**చట్టం, మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి యాంటీ డ్రగ్ కమిటీ సమన్వయ సమావేశం జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, పోలీస్, వైద్య, అగ్రికల్చర్, విద్య, సంక్షేమ, డ్రగ్ ఇన్స్పెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాను మాదకద్రవ్యాలు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని చెప్పారు. జిల్లాలో గంజాయి సాగు చేస్తున్నట్లు పట్టుబడి కేసులు నమోదు అయితే అటువంటి వారిపై ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రభుత్వ పథకాలు పూర్తిగా రద్దు అవుతాయన్నారు.. మనోరాబాద్ తూప్రాన్ ఏరియాలో పరిశ్రమల ఉంటాయని వలసవాదులు ,యువత కంపెనీలలో పనిచేస్తూ డ్రగ్స్ సేవించడం కలిగి ఉండడం ఉంటాయన్నారు. చెక్ పోస్టు ఏర్పాటు చేసి రవాణాను అడ్డుకొని డ్రగ్స్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించాలన్నారు.ఖరీఫ్ పంట సాగు చేయలేని సాగుకు యోగ్యంలేని ప్రదేశాల్లో ఎక్కువగా గంజాయి పండించే అవకాశం ఉందని అటువంటి వాటిపై వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీ నిర్వహించి నివేదికల సమర్పించాలన్నారు మాదకద్రవ్యాల వినియోగం, రవాణాపై ఉక్కుపాదం మోపేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో బాధ్యతగా పని చేయాలన్నారు. వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ల సమన్వయంతో గతంలో గంజాయి పండించే సరఫరా చేసిన వాటిపై నిగా పెంచాలన్నారు సీజ్ చేసిన డ్రగ్స్ ప్రాధాన్యత క్రమంలో డిస్పోస్ చేయాలన్నారు చికెన్ సెంటర్స్, పాఠశాలలు, హాస్టల్ బిల్డింగ్స్ లలో సెలవు దినాల్లో యువత డ్రగ్స్ వాడే అవకాశం ఉన్నందున వాటిపై నిఘా పెంచాలన్నారు. తండాలు రిమోట్ ఏరియాలలో జాయింట్ ఇన్స్పెక్షన్ నిర్వహించి డ్రగ్స్ నిర్మూలనకు తమ వంతు సహకారం అందించాలన్నారు జిల్లాలో అన్ని మద్యం షాపులలో 18 సంవత్సరాలు నిండని వారికి మద్యం అమ్మరాదని బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్థాయి అభివృద్ధి కమిటీల ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ నిషేధిత డ్రగ్స్ ను అమ్మకుండా నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు జిల్లాలో ఉన్న వైన్ షాపులు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని ప్లాస్టిక్ వాడినా కలిగి ఉన్న కేసులు నమోదు చేస్తూ చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా పోలీస్ యంత్రాంగం నిరంతర తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయడం జరుగుతుంది జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## గ్రంథాలయాలు సన్మార్గం చూపే వైట్ హౌజ్లు

- జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి
- గ్రంథాలయంలో విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించిన కలెక్టర్





**చట్టం:**గ్రంథాలయాలు కేవలం పుస్తకాల రిపోజిటరీ మాత్రమే కాదని సమాజంలోని అజ్ఞాన అంధకారాన్ని తొలగించే సన్మార్గం చూపే వైట్ హౌజ్ లని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. సిటీ సెంట్రల్ లైబ్రరీ లో వివిధ విభాగాలలో అన్ని రకాల విలువైన పుస్తకాలు, దినపత్రికలు రీడర్స్ కు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారుల కలెక్టర్ ఆదేశించారు. బుధవారం చిక్కడపల్లిలోని సిటీ సెంటర్ లైబ్రరీని ఆమె సందర్శించారు. లైబ్రరీలోని అన్ని విభాగాలను పరిశీలించి వచ్చిన రీడర్స్ తో గ్రంథాలయంలో ఉన్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే రీడర్స్ సంఖ్య ఎక్కువగా ఉన్నందున లైబ్రరీ వాలంటరీలను ఏర్పాటు చేసుకొని పలు విభాగాల్లో అందుబాటులో ఉంచాలని అలాగే నియమించిన వారందరికీ ఐడి కార్డు కూడా అందజేయాలని ఆమె సూచించారు. పలు విభాగాల్లో సబ్జెక్టుల వారీగా పుస్తకాలను అందుబాటులో ఉంచాలని వచ్చే రీడర్స్ కు సులువుగా ఉంటుందని ఆమె సూచించారు. గ్రంథాలయాలు విద్యతోపాటు వ్యక్తిగత వృద్ధి అలాగే సమాజాభివృద్ధికి ముఖ్యమైనవని అన్నారు. లైబ్రరీలోని చిల్డ్రన్స్ విభాగం, మహిళా విభాగం, జ్ఞాన జ్యోతి రీడింగ్ హాల్ , పాఠ్యపుస్తకాల విభాగం, పాత దినపత్రికల విభాగం, సమావేశపు హాల్ లను ఆమె పరిశీలించారు. లైబ్రరీలో నిరంతరం విద్యుత్ తో పాటు త్రాగునీరు అలాగే వెలుతురు ఉండేలా చూడాలని సూచించారు. ఈ గ్రంథాలయంలో వచ్చే రీడర్స్ కోసం ఉన్నత విద్య, కాంపిటీటివ్ ఎగ్జామ్స్ బుక్స్, యు పి ఎస్ సి, టి జి పి ఎస్ సి, ఈసెట్, నీట్ తదితర కోర్సులకు సంబంధించి విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని ఆమె సూచించారు. అదేవిదంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించే విదంగా సంసిద్ధులై ఉండాలని ఆమె సూచించారు. గ్రంథాలయంలో రోజుకు 1500 పైగా రీడర్స్ వస్తున్నందున అన్ని సదుపాయాలు కల్పించాలని ముఖ్యంగా వాష్ రూమ్స్ ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే వచ్చే రీడర్స్ కు మధ్యాహ్న సమయంలో భోజనం ఏర్పాట్ల గురించి సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. తదుపరి కార్యదర్శి తో గ్రంథాలయంలోని క్యాడర్ స్ట్రెంత్ , భవనం స్థితిగతులు, నిధుల మంజూరు, పరిపాలన శాంక్షన్ లు తదితర అంశాలపై ఆమె సమీక్షించి పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, గ్రంథాలయ కార్యదర్శి పద్మజ, తహసిల్దార్ రాణా ప్రతాప్ సింగ్, లైబ్రేరియన్ మహేందర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ జలధార అందాల తిలకించేందుకు పర్యాటకుల సందడి

**చట్టం, నాగార్జునసాగర్ :**ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లు 26 తెరిచి రెండవ రోజు కావడంతో నాగార్జునసాగర్ లో పర్యాటకుల సందడి నెలకొంది . ఈ అద్భుత దృశ్యాలను చూసి తిలకించేందుకు పర్యాటకులు భారీగా ఇక్కడికి వచ్చారు. తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పర్యాటకులు సాగర్ అందాల దృశ్యాలను చూసి తిలకించారు.ప్రాజెక్ట్ అందాలను పర్యాటకులు వారి సెల్ ఫోన్ కెమెరాలలో చిత్రాలను బంధించారు. సాగర్ లో ప్రధానంగా ఉన్న పర్యాటక కేంద్రాలు, బుద్ధవనం,సాగర్ ప్రాజెక్టు,ఎత్తిపోతల, అనుపు,ఎత్తిపోతల,కృష్ణానదిలో లాంచి విహారయాత్ర జలాశయం మధ్యలో ఉన్న నాగార్జున కొండకు లాంచి ప్రయాణం,విజయవిహార్ అతిథి గృహం,న్యూ బ్రిడ్జి,తదితర ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేశారు.సాగర్ జలాశయంలో ఈ సమయంలో పర్యాటక ఆకర్షణగా మారినప్పటికీ,భద్రతా చర్యలను పాటించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు

**-నాగార్జునసాగర్ ప్రాజెక్టు సమాచారం..**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు16 గేట్లు 5 అడుగుల మేర, 10 గేట్లు,10 అడుగులు ఎత్తడంతో స్పిల్‌వే ద్వారా 2,64,642,క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.జలాశయం పూర్తి నీటి మట్టం 590 అడుగులు కాగా,ప్రస్తుతం 585.90,అడుగులుగా ఉంది,జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.0450,టీఎంసీలు కాగా,ప్రస్తుతం 300.0315,టీఎంసీల నీరు నిల్వ ఉంది.ఇన్‌ఫ్లో, 282124క్యూసెక్కులుగా ఉండగా,ఔట్‌ఫ్లో 310943,క్యూసెక్కులుగా కొనసాగుతుంది, భారీ నీటి విడుదల కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో అవసరాలను తీర్చడమే కాక, వరద నియంత్రణకు కూడా దోహదపడుతోంది.



## లక్ష స్థుపారీ ఇచ్చి భర్త హత్యకు స్కెచ్ గీసిన భార్య

- ప్రియుడితో కలిసి భర్తను చంపేందుకు యత్నం
- మైనర్ తో సహా ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు







**భర్త పాస్ పోర్ట్ సైజ్ పోటో ఇచ్చి అతనిని హత్య చేసిన వారికి లక్ష రూపాయలు ఇస్తానని ప్రియుడికి ఆఫర్ చేసింది భార్య**

**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** ప్రియురాలే లక్ష రూపాయలు ఇచ్చి భర్తను మట్టుబెట్టుమంటే చేతికి మట్టి అంటకుండా తనకు తెలిసిన వారిద్వారా పక్కా స్కెచ్ గీశాడు ప్రియుడు. పథకం ప్రకారం ప్రియురాలి భర్తకు అప్పు ఇప్పించే వంకతో నిర్మాణుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి అక్కడ పూటుగా మద్యం తాగించి మట్టుబెట్టాలని ఉద్దేశంలో భాగంగా సుత్తితో మోది దాడి చేశారు ప్రియుడు అండ్ గ్యాంగ్. కానీ ప్రాణాల మీద ఆశతో అ వ్యక్తి వారి నుంచి జరిగిన దాడిలో రక్తమోడుతున్నా తప్పించుకుని పారిపోయి ప్రాణాలను దక్కించుకున్నాడు. చివరకు పోలీస్ లకు ఫిర్యాదు చేయడంతో ప్రియురాలు, ప్రియుడితో పాటు మరో ముగ్గురిని అరెస్టు చేసి కటా కటాల వెనక్కి పంపినట్టు ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎల్లారెడ్డి డిఎస్పీ శ్రీనివాస్ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తు నాగిరెడ్డి పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న ఆత్మకూర్ గ్రామానికి చెందిన పల్లే రవి అనే వ్యక్తి ఈ నెల 24న తనపై తన భార్య సంపూర్ణ తో పాటు అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జాన్సన్, నవీన్ మరికొందరు దాడి చేసి గాయపరిచారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఎస్ఐఆర్ నమోదు చేసి విచారణ చేపట్టారు నాగిరెడ్డి పేట్ పోలీసులు. కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు డిఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో నాగిరెడ్డి పేట్ ఎస్ఐ అగస్త్య భార్గవ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా విస్తుపోయే నిజాలు బహిర్గతమయ్యాయి... చిన్న ఆత్మకుర్ గ్రామంలో ఆశ వర్కర్ గా పనిచేసే 35 సంవత్సరాల సంపూర్ణకు 23 సంవత్సరాల వయస్సు కలిగిన అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ జాన్సన్ తో వివాహేతర సంబంధం ఉంది. తమ అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్న తన భర్త రవిని మట్టుబెట్టాలని సంపూర్ణ ప్లాన్ వేసింది. అందుకు గాను తన భర్తను చంపిన వారికి లక్ష రూపాయలు ఇస్తానని ప్రియుడికి తెలిపి రవికి సంబంధించిన పాస్ పోర్ట్ సైజ్ ఫోటోను గుర్తు పట్టేందుకు గాను ఇచ్చింది. ప్రియురాలి ఆపర్ లక్ష రూపాయలు నచ్చగా ఆమె భర్త లేకుంటే తమ శారీరక సంబంధానికి అడ్డు అదుపు ఉండదని ప్రియుడు రవి పక్కా స్కెచ్ వేశాడు. తనకు తెలిసిన మేస్త్రి పనిచేసే తాండూర్ గ్రామానికి చెందిన చాకలి రాజు, చిన్న అత్మకుర్ కు చెందిన మరో ట్రాక్టర్ డైవర్ ఆర్. నవీన్, నాగిరెడ్డి పేట్ మండలానికి చెందిన మైనర్ బాలుడిని ఒప్పించారు. పథకం ప్రకారం ఈ నెల 24న రవికి అప్పు ఇప్పిస్తామని ఆశ చూపి పెద్దరెడ్డి డంపింగ్ యార్డ్ ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడ అందరు మద్యం సేవించారు. రవి మద్యం మత్తులో ఉండగా జాన్సన్,చాకలిరాజులు కలిసి సుత్తెతో రవిపై దాడి చేశారు. రవి వారి దాడినుంచి తప్పించుకొని స్థానికంగా ఒక ఫాం హౌస్ వైపు పరిగెత్తాడు. రవిపై మరోసారి జాన్సన్ దాడికి పాల్పడ్డాడు. అయినప్పటికి ఫాం హౌజ్ లోకి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం రవి భార్య సంపూర్ణతో పాటు ప్రియుడు రవి, చాకలి రాజు, నవీన్, మైనర్ బాలుడితో పాటు రెండు బైక్ లు, రక్తపు మరకలు కలిగిన బట్టలు, సుత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు డిఎస్పీ సుంకర శ్రీనివాస్ తెలిపారు.

# అసత్య సమాచారంతో అక్రమ అరెస్టులు సరికాదు: ఏబీవీపీ శశి



**చట్టం నిజామాబాద్:** అసత్య సమాచారంతో పోలీసులు అక్రమ అరెస్టులు, బెదిరింపులకు పాల్పడటం సరైనది కాదని ఏబీవీపీ (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) ఇందూరు విభాగ్ కన్వీనర్ శశి అన్నారు. ఏబీవీపీ నిజామాబాద్ కార్యాలయానికి ఈరోజు ఉదయం 20 నుండి 30 మంది పోలీసులు వచ్చి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యక్రమం చేస్తున్నారంటూ తమను అరెస్ట్ చేయడానికి వచ్చారని ఆయన తెలిపారు. ఈరోజు నిజామాబాద్‌లో ఏబీవీపీకి ఎలాంటి కార్యక్రమం లేదని, రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ మెంబర్‌షిప్ డ్రైవ్ జరుగుతుందని శశి స్పష్టం చేశారు. మెంబర్‌షిప్ కోసం వెళ్తున్న తమను దాదాపు 9 గంటల నుండి 12 గంటల వరకు ఆఫీసులోనే అక్రమంగా నిర్బంధించి, బయటికి వెళ్లనివ్వకుండా భయభ్రాంతులను చేయడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. తప్పుడు సమాచారంతో విద్యార్థి నాయకులను, విద్యార్థి సంఘాలను అణచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పోలీసులు ద్వారా ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. మీ తాటాకు చప్పుళ్లకు, ఉడుత బెదిరింపులకు భయపడే ఆర్గనైజేషన్ ఏబీవీపీ కాదు, ఏబీవీపీ అంటే విద్యార్థుల గుండెచప్పుడు అని శశి హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి దాదాపు రూ. 8,300 కోట్లు విడుదల చేయకపోవడం వలన పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి రాష్ట్రంలో నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం మెడలు వంచైనా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల అయ్యే వరకు కార్యక్రమాలు, ఉద్యమాలు చేయడానికి శ్రీకారం చుట్టబోతున్నామని శశి తెలిపారు. ఆగస్టు మొదటి వారంలో దాదాపు 10,000 మంది విద్యార్థులతో నిజామాబాద్ జిల్లా మొత్తాన్ని కదిలించడానికి సిద్ధమవుతున్నామని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల అయ్యే వరకు తమ ఉద్యమాన్ని ఆపేదే లేదని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని శశి స్పష్టం చేశారు.

# పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు



**చట్టం ముస్తాబాద్ :** పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు, ముస్తాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైమరీ స్కూల్, అంగన్వాడీ కేంద్రాలను ఆదర్శంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, మధ్యాహ్న భోజనం వండే వంట గదులు, స్టోర్ రూమ్ లను స్వయంగా తిరిగి పరిశీలించారు. ప్రైమరీ స్కూల్ లోని విద్యార్థుల హాజరు వివరాలు స్వయంగా పరిశీలించి అటెండెన్స్ తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ పాఠశాలలో ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని తద్వారా అన్ అకాడమీ క్లాసులు ప్రారంభించడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న బెంచీ లను ఇతర పాఠశాలలకు, నిరుపయోగంగా ఉంచిన కుట్టు మిషన్ లను కలెక్టరేట్ కు తరలించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో గల ప్లే గ్రౌండ్ కు సిమెంట్ ఫ్లోరింగ్ చేయించాలని, విద్యార్థులు భోజనం చేయడానికి డైనింగ్ రూమ్ లో బెంచీలు ఏర్పాటు చేయాలని, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తే అవసరమైన నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. స్కూల్ డ్రైనేజీ పైప్ లైన్ మరమ్మత్తు చేయించాలని పేర్కొన్నారు. ప్రైమరీ పాఠశాలలో అంగన్వాడీ సెంటర్లలో గోడలకు వైట్ వాష్ చేయాలని కలెక్టర్ పంచాయతి సెక్రటరీని అదేవిదంగా అంగన్వాడి సెంటర్లో లైటింగ్ సరిగా లేనందున వెంటనే ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయవలసిందిగా అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణలో గడ్డి మొక్కలు పిచ్చి మొక్కలు పెరగకుండా ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ సిబ్బందితో శుభ్రం చేయాలని, అదే విధంగా మధ్యాహ్న భోజన పథకం లో భోజనం కట్టెల పై వుండకుండా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేశామని కావున వెంటనే గ్యాస్ స్టవ్ లను ఏర్పాటు చేసుకొని బిల్లులు కలెక్టరేట్ సమర్పించాలని హెడ్ మాస్టర్ కు తెలియజేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తహసిల్దార్ ను కలిసిన బీజేపీ నాయకులు



**చట్టం న్యూస్ బీర్కూర్ :** బీర్కూర్ మండల కేంద్ర నికి ఎల్లారెడ్డి మండలం నుండి బదిలీ పై నియమితులైన తహసిల్దార్ సాయి భుజంగరావును బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో బీర్కూరు మండలం బిజెపి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీర్కూర్ బీజేపీ మండల అధ్యక్షుడు నాగేళ్ళ సాయికిరణ్, మండల ప్రధాన కార్యదర్శులు యోగేశ్వర్, బొంతల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు బసవరాజ్, రాము, బిజెపి సీనియర్ నాయకులు పోచుగోండ, పండరి సాయిబాబా, ప్రవీణ్, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# మద్నూర్ మండల కేంద్రంలో హాస్పిటల్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్



**చట్టం మద్నూర్ :** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండల కేంద్రంలో ఉన్న హాస్పిటల్ ను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గారు సందర్శించారు. అనంతరం హండే కేలూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను సందర్శించారు. లబ్ధిదారుతో మాట్లాడి ఇంటి ముందు మొక్క నాటమనీ కోరడంతో కలెక్టర్ గారి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇంటి ముందు మొక్కను నాటడం జరిగింది. ఆ వెంటనే మండలం లోని మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గారు మాట్లాడుతూ వర్షాకాలం కావున గ్రామాలలో కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని , ప్రజలకు అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చిన పై అధికారుల దృష్టికి తీసుకు వచ్చి అట్టి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా చూడాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపండి, పింఛన్ల పంపిణీ, త్రాగు నీరు, రోడ్లు, వాగులు, చెరువులు అన్ని సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ నిరంతరం ఉండాలని ఆదేశించారు. సమీక్ష సమావేశం అనంతరం భూ భారతి సదస్సు లో వచ్చిన దరఖాస్తుకు సంబంధిత భూమి రికార్డు ప్రకారం భూ యజమాని సర్వే నెంబర్ గుర్తించి తగు వ్యక్తికి భూమి పట్టా హక్కులు ఇవ్వడం కోసం సంబంధిత సర్వే నెంబర్ గల భూమిని మద్నూర్ గ్రామ శివారు సోనాల రోడ్డు లో జిల్లా కలెక్టర్ గారు సందర్శించారు. రికార్డు లను పరిశీలించి భూ భారతి రెవెన్యూ దరఖాస్తులు పరిష్కరించే విధానం బాగుంది అని సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ గారి వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గారు, మండల తహసీల్దార్ ఎం డి ముజీబ్, గిర్దవార్ ఏం శంకర్, సర్వేయర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను సందర్శించి తక్షణమే 2 లక్షలు ప్రకటించి సమస్యలను పరిష్కరించిన జిల్లా కలెక్టర్



**చట్టం మద్నూర్:** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలం లోని పెద్ద ఎక్లారా గ్రామ శివారులోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గారు బుధవారం సందర్శించి స్కూల్ లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో ఉన్న సమస్యలను విని తక్షణమే పరిష్కరించారు. ముఖ్యంగా హాస్టల్ విద్యార్థులకు నీటి సమస్య ఉండటంతో వెంటనే *(2 లక్షలు ప్రకటించారు)* ఒకటి బోర్ వెల్ కొరకు లక్ష రూపాయలు మంజూరు చేశారు. అనంతరం హాస్టల్ గేట్ వద్ద సెక్యూరిటీ గార్డు కాపల ఉండటానికి ఒక లక్ష రూపాయలు వెంటనే మంజూరు చేశారు . అదే విధంగా మెస్ వద్ద కు వెళ్ళడానికి విద్యార్థులకు సౌకర్యం గా ఉండటానికి నాలుగు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. హాస్టల్ సందర్శన సందర్భంగా జిల్లా కలెక్టర్ గారి దృష్టికి హాస్టల్ అధికారులు, విద్యార్థులు సమస్యలను కలెక్టర్ గారి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే వాటి పరిష్కరిస్తూ నిధులు మంజూరు చేయగానే విద్యార్థులు, అధికారులు సంతోషం వ్యక్తం చేస్తూ కలెక్టర్ గారికి కృతజ్ఞతలు తెలిపారు. వన మహోత్సవం లో భాగంగా హాస్టల్ లో అటవీ శాఖ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ గారు మొక్కలను నాటారు. కలెక్టర్ గారి వెంట బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గారు, DPO, DLPO, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి, మండల తహసీల్దార్ ఎం డి ముజీబ్, ఎంపిడిఓ రాణి, ఎంపీవో నర్సయ్య, గిర్దవార్ ఏం శంకర్, గురుకుల పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# శభాష్ మహిళా కండక్టర్

**చట్టం ప్రతినిధి కామారెడ్డి :** కామారెడ్డికి చెందిన మహిళ కండక్టర్ తన నిజాయితీని చాటుకొని కామారెడ్డి ఆర్టీసీ డిపోలో శభాష్ అని నిరూపించుకున్నారు. బస్సులో ఓ ప్రయాణికురాలు తన బ్యాగ్ మర్చిపోగా తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం జేబీఎస్ వరకు వెళ్లింది. అందులో ఎక్కిన ఒక ప్రయాణికురాలు తన బ్యాగును బస్సులో మర్చిపోయి జేబీఎస్లో దిగిపోయింది. బస్సులో ఉన్న బ్యాగును గమనించిన కండక్టర్ సువర్ణ దానిని తీసుకొని తన దగ్గర ఉంచుకున్నారు. బస్సు దిగిపోయిన ప్రయాణికురాలు తన వద్ద బ్యాగు కనిపించకపోయేసరికి తిరిగి బస్సు స్టాప్ వద్ద కు చేరుకున్నారు. అక్కడ ఉన్న కండక్టర్ను సంప్రదించగా బ్యాగు తన వద్ద ఉందని తెలిపారు. బ్యాగులో నాలుగు తులాల బంగారం, సెల్ ఫోన్తో పాటు నగదు ఉండగా వాటిని ప్రయాణికురాలికి కండక్టర్ సువర్ణ అప్పగించారు.

# డ్రైవర్స్ ఏ చిన్న తప్పు చేసినా.. స్కూల్ యాజమాన్యందే బాధ్యత

- ప్రతి స్కూల్ బస్సులోను తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలను అమర్చాలి
- పాఠశాలల, కళాశాల బస్ ల డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి
- పెద్దపల్లి డీసీపీ కరుణాకర్



**చట్టం రామగుండం కమిషనరేట్:** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలోని స్కూల్,కళాశాల యజమానులు, బస్ డ్రైవర్లకు అవగాహన సదస్సు కార్యక్రమం గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని అడ్డగుంటపల్లి లోని ఆద్య బంకెట్ హాల్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కి పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ , గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ లు ముఖ్య అతిథులుగా హాజరై పలు ఆదేశాలు, సూచనలు చేశారు.స్కూల్, యాజమాన్యాలు నైపుణ్యం గల డ్రైవర్లను నియమించుకోవాలని, పిల్లలను బస్సు ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే బస్సులను నిలుపుదల చేయాలన్నారు. డ్రైవర్లు ఓవర్ టేకింగ్ చేయవద్దని సూచించారు. బస్సు డ్రైవర్లు మద్యం సేవించి, సెల్ఫోన్లు ఉపయోగించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్ లలో ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సిలిండర్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. బస్సులో సీట్లకు సరిపడా విద్యార్థులను మాత్రమే తీసుకెళ్లాలని డీసీపీ పేర్కొన్నారు. స్కూల్ బస్సు డ్రైవర్ లకు పోలీస్ వారి తరుపున ముఖ్యమైన సూచనలు చేశారు.పిల్లల భద్రత కోసం మీరు ట్రాఫిక్ నియమాలను పాటించాలి, విద్యార్థులను ఎక్కించేటప్పుడు, దించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. బస్సును క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి.ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ సిగ్నల్స్ వద్ద, మూల మలుపుల వద్ద, ప్రధాన కూడల్లా వద్ద వేగాన్ని నియంత్రించండి.విద్యార్థుల భద్రత కోసం విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్త వహించండి. బస్ పూర్తిగా ఆగిన తరువాత పిల్లలను ఎక్కించడం, దించడం కోసం ఒక వ్యక్తిని విద్యార్థులకు సహాయం గా ఏర్పాటు చేయాలి. బస్సును ప్రతిరోజూ తనిఖీ చేయండి. టైర్లు, బ్రేక్లు, ఇతర ముఖ్యమైన భాగాలను పరిశీలించండి. ఏవైనా సమస్యలు ఉంటే, వాటిని యాజమాన్యంకు చెప్పి వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోండి. విద్యార్థులను అప్రమత్తంగా ఉంచడం కోసం విద్యార్థులకు బస్సు భద్రతా నియమాల గురించి అవగాహన కల్పించండి. బస్సులో ప్రవర్తన ఎలా ఉండాలో వారికి చెప్పండి. విద్యార్థులు మీ బస్సులో సురక్షితంగా ప్రయాణించేందుకు మీరు బాధ్యత వహించాలి అనే విషయం గుర్తుంచుకోండి. మొదటగా ప్రథమ చికిత్స కిట్ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచండి. బస్సులో అగ్నిమాపక యంత్రం ఉందని ఉంచుకోవాలి. డ్రైవింగ్ చేసేటప్పుడు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఉండండి. సమయపాలన పాటిస్తూ సమయానికి బస్సును నడపడానికి ప్రయత్నించండి. విద్యార్థులతో ఓపిక, సహనం గా ఉంటూ మంచి ప్రవర్తన తో ఉండండి. పిల్లలకు ఏదైనా సమస్య తలెత్తితే, దానిని పరిష్కరించడానికి, యాజమాన్యం, తల్లితండ్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నించండి. మీకు అవసరమైనప్పుడు తగినంత విశ్రాంతి తీసుకోండి. బస్సులో భద్రత యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు ఎప్పటికప్పుడు గుర్తు చేయండి, అవగాహన కల్పించండి.ఈ సూచనలను అనుసరించడం ద్వారా, మీరు పాఠశాల బస్సును సురక్షితంగా నడపగలరు, విద్యార్థుల రక్షణ, భద్రత సురక్షితంగా ఉంటుంది.స్కూల్ బస్సు డ్రైవర్లు మద్యం మత్తులో స్కూల్ బస్సులు నడిపినట్లు గుర్తిస్తే అలాంటి వారిపై ఎట్టి పరిస్థితుల లో ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని, ఏదైనా ప్రమాదం జరిగితే స్కూల్ యాజమాన్యం పైన కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న : ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ



**చట్టం నిజామాబాద్ :** అన్నదానం మహాదానమని అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న అని నిజామాబాదు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ అన్నారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో నిజామాబాదు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ జి.బాబురావ్ జన్మదిన సందర్భంగా అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ మస్తాన్ అలీ ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరై మాట్లాడుతూ ఆకలితో అలమటించే పేదలకు అన్నప్రసాద కార్యక్రమాలు కడుపు నింపుతాయన్నారు. లయన్స్ క్లబ్ లు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. లయన్స్ జోన్ చైర్మెన్ భూమన్న, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, పి.రాఘవేందర్, కోశాధికారి అంకం రాజేందర్, పూర్వాధ్యక్షులు శివలింగం, గంగాదాస్, ఉపాధ్యక్షులు రవీందర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ వైర్లలో ఉన్న చెట్ల కొమ్మలను పట్టించుకోని అధికారులు



**చట్టం, రామగుండం:** విద్యుత్ వైర్లను కమ్మేస్తూ చెట్ల కొమ్మలు పెరిగి ప్రమాదకరంగా మారాయని, సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని రామగుండం 10వ డివిజన్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోదావరిఖని కోదండ రామాలయం ను ఆనుకొని ఉన్న ప్రహరీ గోడకు అవతలి వైపున చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగాయని అవి కరెంటు తీగలపై పడే ప్రమాదం ఉందని రాంనగర్ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం ముందు ప్రతి రెండవ, నాలుగవ శనివారం ట్రీ కటింగ్ పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేసే అధికారులు ఇటువైపు చూడడం లేదని వారు వాపోతున్నారు. ఏపుగా పెరిగిన కొమ్మలు చిన్న గాలి వానకు నేలకూలే అవకాశం ఉందని... దీంతో విద్యుత్ తీగలు తెగి పడడంతో పాటు కొమ్మలు ఇళ్లపై పడే ప్రమాదం ఉందని వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేకుండా చెట్ల కొమ్మలను కొట్టివేస్తే చర్యలు తీసుకునే కార్పొరేషన్ అధికారులు ప్రమాదానికి కారణమైన కొమ్మలను తొలగించాలని వారు కోరుతున్నారు. ప్రాణాపాయంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్న ప్రయోజనం లేదని వారు వాపోయారు. ప్రమాదం జరిగిన తర్వాత విచారం వ్యక్తం చేయడం కన్నా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు విద్యుత్ తీగలలో ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఇష్టంతో చదువుకోవాలి.. కష్టపడి క్రీడల్లో ఎదగాలి



**చట్టం, రామగుండం:** రామగుండం నియోజకవర్గం లోని ఎన్టీపిసి జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 10వ తరగతి క్యూఆర్ కోడ్ పుస్తకాల ప్రారంభ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల విద్యలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశ పెట్టి, విద్యార్థుల పఠనానికి మరింత ఉపయుక్తంగా చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వ పర్యవేక్షణలో "స్కాన్ అండ్ లెర్న్ - ఏ యూనిక్ లెర్నింగ్ ఎక్స్పీరియన్స్" అనే నినాదంతో ఈ క్యూఆర్ కోడ్ పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రతి పాఠ్యాంశానికి అనుగుణంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సంబంధిత ఆడియో, వీడియో, శిక్షణా పాఠాలు పొందవచ్చు. ఈ కార్యక్రమంలో సింగరేణి జనరల్ మేనేజర్ లలిత్ కుమార్ , ఏసీపీ రమేష్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.... మా నియోజకవర్గ విద్యార్థులు సాంకేతికతను ఉపయోగించి ప్రపంచానికి పోటీగా నిలవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ క్యూఆర్ కోడ్ పుస్తకాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే నాణ్యమైన విద్య ముఖ్యమని నమ్ముతున్నాం. ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరికి సహకారం అవసరం అన్నారు.ఈ కార్యక్రమానికి సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్సిసిఎల్) వారి సిఎస్ఆర్ నిధుల ద్వారా మద్దతు అందించబడింది. ఈ కార్యక్రమం విజయవంతంగా సాగడంతో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్లు వివిధ విభాగల అధ్యక్షులు సోషల్ మీడియా తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**చట్టం, భీంగల్ ప్రతినిధి :** బడా భీంగల్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పదవి విరమణ పొందిన గణిత శాస్త్ర వేత్త శ్రీ శికారి విజయ్ కుమార్ పదవీ విరమణ కార్యక్రమం బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విజయ్ కుమార్ కమల దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పాఠశాలలో విజయ్ కుమార్ అందించిన సేవలను, విద్యను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాయన్నారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా కష్టతరంతో కూడుకున్నదని చెప్పారు.విద్యార్థుల భవిష్యత్ దిశానిర్దేశం చేయడంలో కీలకంగా ఉంటుందన్నారు. పదవీ విరమణ పొందినప్పటికీ వ్యక్తిగతంగా విజయ్ కుమార్ తన అనుభవాలను విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ స్వామి,ఉపాధ్యాయ బృందం, వీడీసీ అధ్యక్షులు మోర్తాడ్ లింబాద్రి, వెన్ను ప్రకాష్, గ్రామ పెద్దలు, విద్యార్థులు,పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్న పోలీసులు



**చట్టం బిచ్కుంద :** కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలో బుధవారం ఉదయం హస్గుల్ వాగు నుండి రెండు ఇసుక ట్రాక్టర్లు దొంగతనంగా ఎలాంటి ప్రభుత్వా అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు

# మాదాపూర్‌లో ఎక్సైజ్ నేరాల వాహనాలకు వేలంపాట

**చట్టం నిజామాబాద్:** ఎక్సైజ్ నేరాలకు సంబంధించి పట్టుబడిన రెండు వాహనాలను తేదీ: 31, జూలై, 2025 గురువారం వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది. ఈ వేలంపాట మాక్లూర్ మండలం, మాదాపూర్‌లోని IML డిపోలో ఉదయం 11 గంటలకు నిర్వహించబడుతుంది. వేలంపాటకు సంబంధించిన పూర్తి వివరాల కోసం ఆసక్తిగల వ్యక్తులు నిజామాబాద్‌లోని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్‌లను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల రిలే దీక్షలు ప్రారంభం: ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డిమాండ్ల ప్రదర్శన



**చట్టం నిజామాబాద్ :** బకాయి బిల్లుల చెల్లింపు, వేతనాల పెంపు, ఇతర సౌకర్యాల కల్పన డిమాండ్లతో ఏఐటీయూసీ (ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికుల రిలే నిరాహార దీక్షలు ఈరోజు నిజామాబాద్ ధర్నా చౌక్‌లో ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలు ఆగస్టు 1వ తేదీ వరకు కొనసాగుతాయని ఏఐటీయూసీ నాయకులు ప్రకటించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య, ఎండీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి దీక్షలో కూర్చున్న వారికి పూలమాలలు వేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడానికి వస్తున్న పేద విద్యార్థులకు మధ్యాహ్నం ఆహారాన్ని అందించాలనే మంచి లక్ష్యంతో ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని తీసుకువచ్చిందని, అయితే ఆచరణలో మాత్రం కార్మికులు, విద్యార్థులు ఇబ్బంది పడే పరిస్థితుల్లో పథకాన్ని కొనసాగించడం సరికాదని అన్నారు. పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండి పెట్టే కార్మికులు కూడా అదే సామాజిక వర్గానికి చెందిన పేదలేనని ప్రభుత్వం గ్రహించాలని ఆయన పేర్కొన్నారు. ఆరు నెలల తరబడి కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టినప్పటికీ, బిల్లులు చెల్లించకపోతే ఏ రకంగా భోజనాన్ని వండి పెడతారని ప్రశ్నించారు. ప్రభుత్వం పెట్టిన మెనూ ప్రకారం ఒక విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించాలంటే రూ. 25 ఖర్చవుతుందని, అయితే ప్రభుత్వం కేవలం రూ. 11 ఇచ్చి చేతులు దులుపుకోవడం, ఆ డబ్బులు కూడా సరైన సమయంలో ఇవ్వకుండా నిజామాబాద్ జిల్లాకే రూ. 6 కోట్ల బకాయిలు ఉండటం ప్రభుత్వ పనితీరును తెలియజేస్తోందని విమర్శించారు.

**డిమాండ్లు**

జిల్లాకు రావలసిన రూ. 6 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలి. గుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలి. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలి. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలి. యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రూ. 10,000 వేతనాన్ని ఇవ్వాలి. ఈరోజు ప్రారంభమైన నిరాహార దీక్షలు నాలుగు రోజుల పాటు కొనసాగుతాయని, ప్రభుత్వం ఇప్పటికైనా బిల్లులు చెల్లించకపోతే సమ్మెకైనా సిద్ధంగా ఉన్నామని వారు హెచ్చరించారు. ఈరోజు దీక్షలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు సాయమ్మ, లతా, నాగలక్ష్మి, సాయిలత, సాయమ్మ, గంగమణి, నరేష్‌లతో పాటు పలువురు కార్మికులు కూర్చున్నారు.

# తోటి విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం



**చట్టం కథలాపూర్ :** కథలాపూర్ మండలం పెగ్గర్ల గ్రామానికి చెందిన కారపు చిరంజీవి కొద్దిరోజుల క్రితం అనారోగ్య కారణాల వాళ్ళ మరణించడంతో, తోటి 10వ 19981999 బ్యాచ్ స్నేహితులు, స్నేహితురాళ్లు చిరంజీవి భార్య కారపు రమ్యకి 66000/ రూపాయల ఆర్థిక సహాయన్ని అందించడం జరిగింది. అదేవిధంగా చిన్ననాటి స్నేహితుణ్ణి గుర్తుచేసుకుంటూ మునుముందు ఏ ఆపద వచ్చిన మేమంతా తోడుంటామని చెప్పడం జరిగింది. బాధలో ఉన్న ఆ కుటుంబన్ని ఓదార్చారు. మిత్రుని జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఇంత తొందరగా మమ్మల్ని విడిపోతావా అంటూ కన్నీరు పెట్టారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు ఎన్నారై తేలు లక్ష్మి నర్సయ్య, అనిల్, ధనంజయ్, శ్రీను, ఫరూక్, మిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 5 ఆగస్టున బీఎస్పీ ఉమ్మడి మెదక్ జిల్లా కార్యకర్తల సమావేశం



**చట్టం సిద్దిపేట, ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన ఉమ్మడి మెదక్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా బిఎస్పి సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ నిసాని రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఆగస్టు 5వ తారీకున ఉమ్మడి మెదక్ జిల్లా బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం ను విజయవంతం చేయాలని కోరారు. సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అతార్ సింగ్ రావు, రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ హాజరవుతారని ఈ సమావేశానికి భారీ ఎత్తున కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు. పూలే అంబేద్కర్ సిద్ధాంతాన్ని ముందుకు తీసుకుపోతూ తెలంగాణలో గ్రామ గ్రామాన పార్టీ బలోపేతం కోసం ఈ సమావేశం ను ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సెంట్రల్ స్టేట్ కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావు సిద్దిపేట జిల్లా కు మొదటిసారిగా విచ్చేస్తున్నందున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సందర్భంగా వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎనగందుల వెంకన్న, సిద్దిపేట జిల్లా ఇన్చార్జి గజ్జల తిరుపతి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కటికల ఓం ప్రకాష్ మెదక్ జిల్లా అధ్యక్షుడు స్వామి దాస్ ఉపాధ్యక్షుడు ఈర్ల మల్లేశం ముదిరాజ్ సిద్దిపేట అసెంబ్లీ అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ నర్సాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు జనార్దన్ గౌడ్ ఇన్చార్జి పంగబాబు హుస్నాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు వేల్పుల రాజు ఇంచార్జ్ బాబు గజ్వేల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఎల్లం సిద్దిపేట అసెంబ్లీ ఉపాధ్యక్షుడు కొండపలకల సంపత్ సిద్దిపేట అసెంబ్లీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

# మైలారం గ్రామంలో ఎరువుల గిడ్డంగికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



**చట్టం ధర్పల్లి:** ధర్పల్లి మండలం లోని ప్రాజెక్టు రామడుగు సొసైటీ పరిధిలో గల మైలారం గ్రామంలో ఎరువుల గిడ్డంగి నిర్మాణానికి బుధవారం రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి భూమి పూజ చేశారు. సహకార బ్యాంకు, సహకార సంఘం నిధులు 30 లక్షల రూపాయలతో నిర్మించే ఈ గిడ్డంగి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజా ప్రభుత్వం లో కాంగ్రెస్ పాలన ప్రజలకు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్న బాలరాజ్, ధర్పల్లి సింగల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి, చైర్మన్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సిహెచ్. నరసయ్య, పి. సుభాష్ ఎం. గంగారెడ్డి,సిహెచ్. శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేయండి

▶ **జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచన**

రుణ పంపిణీలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిగా సాధించేందుకు బ్యాంకర్లు అంకిత భావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ త్రైమాసిక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పంట రుణాల లక్ష్యాలను సాధించడంలో నిర్లక్ష్యం వహించకుండా, కొన్ని బ్యాంకులు ఇంకా ఎందుకు వెనుకబడ్డాయో తెలియజేయాలని అన్నారు. సమర్థవంతంగా సమీక్షలు నిర్వహించి అన్ని రంగాల్లో వందశాతం రుణాలు మంజూరు చేయాలని కోరారు. విద్యా రుణాల విషయంలో విద్యార్థులకు అవగాహన కల్పించి, అర్హత కలిగిన వారికి రుణ సదుపాయం కల్పించాలని సూచించారు.వీధి వ్యాపారులకు సూక్ష్మ రుణాలను వేగంగా మంజూరు చేయాలన్నారు. ఇందిరా మహిళా శక్తి సంఘాలకు అవసరమైన రుణాలు అందించాల్సిందిగా, ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది వికలాంగులు ఉన్న గ్రూపులకు బ్యాంకు ఖాతాలు తెరిచి రుణాలు ఇవ్వాలన్నారు. వివిధ శాఖల సమన్వయంతో ఎంపికైన లబ్ధిదారులకు వ్యవసాయేతర రంగాల్లో స్వయం ఉపాధికి అవసరమైన రుణాలు వెంటనే మంజూరు చేయాలని సూచించారు.లక్ష్యాల సాధన తప్పనిసరి రుణ గ్రహీతలు యూనిట్లు ఏర్పాటు చేశారా లేదా అన్న విషయాన్ని సంబంధిత శాఖలు కచ్చితంగా పరిశీలించాలన్నారు. స్వయం సహాయక సంఘాల లింకేజీ రుణాలను పూర్తిగా పంపిణీ చేయాలని, సబ్సిడీ రుణాల్లో జాప్యం చేయవద్దని సూచించారు. తదుపరి సమావేశానికి లక్ష్యాలను అధిగమించకపోతే వ్యవసాయేతర రంగాల్లో రుణాల విషయంలో వెనుకబడిన బ్యాంకులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎల్‌డిఎం సుశీల్ కుమార్, ఆర్‌బిఐ ప్రతినిధి రెహమాన్, నాబార్డ్ ఎజిఎం అఖిల్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యాన శాఖ అధికారి సురేష్, మైనారిటీ సంక్షేమ అధికారి నవీన్ రెడ్డి, ఇతర శాఖల అధికులు, బ్యాంకు నియంత్రణ అధికారులు పాల్గొన్నారు.




## అందని ద్రాక్షగా గృహజ్యోతి




**చట్టం న్యూస్ జహీరాబాద్:** పట్టణంలో మహాలక్ష్మీ మగువ క్రింద రూ" 2500 రూ" 500 క్రింద గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిదారులకు జమ కావలసిన గ్యాస్ సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం లేదంటూ మహిళలు ప్రభుత్వంపై ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.పట్టణ కేంద్రంలోని బ్యాంకుల చుట్టూ ప్రతిరోజు మహిళలు ప్రదక్షణలు చేస్తూ, తమ ఖాతాలను తనిఖీ చేసుకొని నిరాశతో వెను తిరుగుతున్నారు. పదే పదే కాంగ్రెస్ నాయకులు గ్యాస్ బండ 500 కే ఇస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ నిజానికి దాదాపుగా 900 నుంచి 1000 రూపాయలు పెట్టి గ్యాస్ బండ కొనుక్కుంటున్నామని ప్రజలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డా తరువాత ఒకటి, రెండు సార్లు గ్యాస్ సబ్సిడిని జమ చేసి, ఆ తరువాత గ్యాస్ సబ్సిడీని లబ్దిదారుల ఖాతాలో జమ చేయడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి గ్యాస్ సబ్సిడీతో పాటు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూపాయలు 2,500 వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరారు.

## క్రీడాంశంలో ఎంజెపి విద్యార్థుల ప్రతిభ




**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి ములుగు జిల్లాల్లో నిర్వహించబడిన 11వ తెలంగాణ రాష్ట్ర సబ్ జూనియర్ సీనియర్ జిల్లాల స్థాయిలో భాగంగా మహాత్మ జ్యోతిబాపూలే మొగుళ్లపల్లి వెంకటాపూర్ విద్యార్థులు పాల్గొని వివిధ క్రీడాంశాలలో అత్యంత ప్రతిభ కనబరిచి ప్రశంస పత్రాలను మరియు మెడల్స్ ను అందుకోవడం జరిగింది. విద్యార్థులందరినీ పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ శారద చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరుతున్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ముఖ్యమని ఉపాధ్యాయులు, ప్రతిభను కనబరిచిన విద్యార్థులను సిహెచ్ రణధీర్ ఈ శివకుమార్ శశివర్ధన్ సిహెచ్ శివకుమార్ స్వాతి రామ్ చరణ్ బి హర్షవర్ధన్ బన్నీ అభినయ్ విద్యార్థులను అభినందించారు.

## పెద్దమ్మ తల్లి ఆలయాన్ని కూల్చడం బాధాకరం



**చట్టం, ముధోల్ :** నిర్మల్ జిల్లా ముధోల్ హిందూ ఉత్సవ కమిటీ హిందూ వాహిని ఆధ్వర్యంలో హైదరాబాద్ పట్టణంలో పెద్దమ్మ తల్లి ఆలయా కూల్చివేయడన్ని ఖండించారు. ప్రభుత్వం హైడ్రా అధికారుల చే హిందూ భక్తుల విశ్వాసానికి ప్రతీగాక నిలిచినా పెద్దమ్మ తల్లి ఆలయాన్ని కూల్చడం అనేది హిందూవుల మనోభావాలు తెబ్బతీయ దమేనని కొన్ని దశబ్ద కాలం నాటినుండి పూజలు చేస్తున్న ఆలయం కూల్చి వేయడమే కాకుండా అమ్మవారి విగ్రహాన్ని ప్రభుత్వం గొప్యంగా దొంగలించి దాచి ఉంచారు. ప్రభుత్వనికి హెచ్చరించేదేమిటంటే కూల్చినటువంటి పెద్దమ్మ తల్లి ఆలయాన్ని 1000 గజాల స్థలం లో పునరనిర్మాణం చేపట్టి,ఆలయాన్ని ఎవరి పరివేక్షణలో కూల్చినారో అట్టి అధికారులను సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలియజేయడం జరిగింది.లేనియెడల తెలంగాణ రాష్ట్రం లో ఉన్న హిందువులంతా కలిసి రాష్ట్రం మొత్తం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమలు చేపట్టుతమన మీడియా ద్వారా ప్రభుత్వనికి తెలియజేయడం జరిగింది.

## ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలి... ఎమ్మెల్యే పోచారం



**చట్టం, బీర్కూర్ :** బీర్కూరు మండలంలోని తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల దేవస్థానంలో నియోజకవర్గం రాష్ట్రం అంతా సుభిక్షంగా ఉండాలని పాడి పంటలు సుభిక్షంగా పండాలని,ప్రజలు సంతోషంగా ఆయురారోగ్యాలతో ఉండాలని తెలంగాణ తిరుమల దేవస్థానం లో సుదర్శన వరుణ యాగాని బుధవారం బాన్సువాడ నియోజకవర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూజలు అభిషేకాలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త,బాన్సువాడ నియోజక వర్గ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోవాలి



**చట్టం, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండలం పంచాయతీ ఇన్చార్జి అధికారి రామకృష్ణకు సమాచార హక్కు చట్టం ను అతిక్రమించి సమాచారం ఇవ్వని ఎల్లారెడ్డి పల్లె గ్రామపంచాయతీ కార్యదర్శి నాంపల్లి శ్రీకాంత్ పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఎల్లారెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సమాచార చట్టం ద్వారా దరఖాస్తు ద్వారాసమాచారం అడిగితే రెండు నెలలు గడుస్తున్న సరియైన అయిన సమాచారం రాకపోవడం అప్పిలేట్ అధికారి రామకృష్ణ కు ఫిర్యాదు చేసినట్లు ఆర్టిఐ భూపాలపల్లి జిల్లా కమిటీ సభ్యుడు గాదం పోషయ్య తెలిపారు. పంచాయతీ కార్యదర్శి పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు.

## నేడు నియోజకవర్గ స్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం




**చట్టం, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని శానిటేషన్, తాగునీరు, హౌసింగ్, పరిశుభ్రత, మంచినీరు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా మరియు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షించేందుకు ఎల్లారెడ్డి శాసనసభ్యులు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని 2025 జూలై 31వ తేదీ గురువారం ఉదయం 9:00 గంటలకు ఎల్లారెడ్డిలోని ఎమ్మెల్యే మదన్మోహన్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి నియోజకవర్గంలోని అన్ని పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావలసిందిగా ఆదేశించబడిందన్నారు. మిషన్ భగీరథ డీఈలు, ఈఈలు, డీఎల్‌పీఓలు (కామారెడ్డి , ఎల్లారెడ్డి) అలాగే అన్ని ఎంపీడీఓలు, ఎంపీఓలు, హౌసింగ్ శాఖకు చెందిన, ఏఈలు, డీఈలు, జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అందరు అధికారులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో శానిటేషన్ పరిస్థితులు, తాగునీటి ప్రాజెక్టుల పురోగతి, మరియు ఇళ్ల నిర్మాణాల ప్రగతి వంటి అంశాలపై సమగ్ర చర్చ జరగనుంది. అధికారులు తమ శాఖల వారీగా పూర్తి వివరాలతో నివేదికలు సమర్పించాలని కోరారు.

## లబ్ధిదారులకు పడని గ్యాస్ సబ్సిడీ..

**చట్టం న్యూస్ జహీరాబాద్:** పట్టణంలో మహాలక్ష్మీ మగువ క్రింద రూ" 2500 రూ" 500 క్రింద గృహజ్యోతి పథకం ద్వారా లబ్ధిదారులకు జమ కావలసిన గ్యాస్ సబ్సిడీ రాష్ట్ర ప్రభుత్వం జమ చేయడం లేదంటూ మహిళలు ప్రభుత్వంపై ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.పట్టణ కేంద్రంలోని బ్యాంకుల చుట్టూ ప్రతిరోజు మహిళలు ప్రదక్షణలు చేస్తూ, తమ ఖాతాలను తనిఖీ చేసుకొని నిరాశతో వెను తిరుగుతున్నారు. పదే పదే కాంగ్రెస్ నాయకులు గ్యాస్ బండ 500 కే ఇస్తున్నామని ప్రగల్భాలు పలుకుతున్నారని, కానీ నిజానికి దాదాపుగా 900 నుంచి 1000 రూపాయలు పెట్టి గ్యాస్ బండ కొనుక్కుంటున్నామని ప్రజలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డా తరువాత ఒకటి, రెండు సార్లు గ్యాస్ సబ్సిడిని జమ చేసి, ఆ తరువాత గ్యాస్ సబ్సిడీని లబ్దిదారుల ఖాతాలో జమ చేయడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి గ్యాస్ సబ్సిడీతో పాటు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూపాయలు 2,500 వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి



**చట్టం, బాన్సువాడ :** బాన్సువాడ పట్టణ కేంద్రంలోని నాయి బ్రాహ్మణ ఫంక్షన్ హాల్ లో సిపిఐ బాన్సువాడ మండల నాల్గవ మహాసభ సిపిఐ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు అధ్యక్షతన జరిగిన మహాసభకు ముఖ్య అతిథిగా సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆమె ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడం కొరకు సిపి పార్టీ శ్రేణులు ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. కార్మికులు సాధించుకున్న చట్టాలను బడా కార్పొరేటర్లకు అనుకూలంగా చట్టాలలో సవరణ చేసి కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని ఆమె విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో 400 ఎంపీ సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మారుస్తానని అనుకున్న బిజెపి ఆర్ఎస్ఎస్ పరివారశక్తులు ప్రజలు ఎన్నికలలో బుద్ధి చెప్పారని, ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీ, బీహార్లో నితీష్ కుమార్ మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వం నడుస్తుందని ఆమె అన్నారు. రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల పని గంటలు పెంచుతూ జీవో తీసుకురావడం విచారకరమని దీనిని వెంటనే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజా అనుకూల నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు. అనంతరం సిపిఐ కామారెడ్డి జిల్లా కార్యదర్శి ఎల్ దశరథ్ మాట్లాడుతూ గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఒంటెద్దు పోకడలు ప్రజావేదిక నిర్ణయాలతో ఆ ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రజలు మట్టి కరిపించారని ఆయన పేర్కొన్నారు.రానున్న కాలంలో సిపిఐ పార్టీ బలోపేతంకు పార్టీ శ్రేణులు ప్రజా సంఘాల నాయకులు సభ్యులు కృషి చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు, డి శంకర్, అశోక్ గౌడ్, టి శ్రీనివాస్, సర్దార్, శివాజీ, రాజు, భూమయ్య, సాయిలు, హనుమాన్లు, అంజయ్య, సుశీల, గంగామణి, రజియా బేగం తదితరులు పాల్గొన్నారు.

## రహదారి గుంతలకు గట్టు తిరుపతిగౌడ్ తాత్కాలిక మరమ్మత్తులు



**చట్టం, శంకరపట్నం :** శంకరపట్నం మండలంలోని కాచాపూర్, రాజాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారిపై ప్రయాణికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కాచాపూర్ మాజీ సర్పంచ్ గట్టు తిరుపతిగౌడ్ చూసి చలించిపోయారు. ముఖ్యంగా విద్యార్థులు, వృద్ధులు గుంతలమయమైన ఈ రోడ్డుపై పడుతున్న కష్టాలు ఆయన్ని కలచివేశాయి. గత కొద్ది రోజులుగా కన్నపూర్ నుండి రాజాపూర్ వరకు బస్సులు నిలిచిపోవడంతో, ఈ రెండు గ్రామాల ప్రజలు రవాణా సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయం తిరుపతిగౌడ్ దృష్టికి రాగానే, ఆయన వెంటనే స్పందించారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన, ఎవరి సహాయం కోసం ఎదురుచూడకుండా తన సొంత ఖర్చులతో రోడ్డు మరమ్మతులకు పూనుకున్నారు. బుధవారం ఉదయం నుంచే, తిరుపతిగౌడ్ పర్యవేక్షణలో రోడ్డుపై మట్టిని పోయించి, పెద్దపెద్ద గుంతలను పూడ్చివేసే పనులు ప్రారంభమయ్యాయి. ఆయన చేసిన ఈ తక్షణ సాయంతో దశాబ్దాలుగా ఉన్న ఈ రోడ్డు సమస్యకు తాత్కాలికంగానైనా ఉపశమనం లభించింది. తిరుపతిగౌడ్ చూపిన ఈ మానవత్వం, సేవా తత్పరతను స్థానికులు ఎంతగానో అభినందిస్తున్నారు. ఆయన చొరవతో త్వరలోనే బస్సులు తిరిగి నడిచి, ప్రజల రాకపోకల కష్టాలు తీరనున్నాయి.

## ఆశాజ్యోతి డయగ్నోస్టిక్ సెంటర్‌లో అన్నదాన కార్యక్రమం

**చట్టం, తూప్రాన్:** తూప్రాన్ పట్టణంలోని ఆశాజ్యోతి డయగ్నాస్టిక్ సెంటర్ లో బుధవారం అమ్మ నాన్న వృద్ధాశ్రమం వారికి, పేషెంట్లకు అన్నదాన కార్యక్రమం ఇంటర్ నేషనల్ డైరెక్టర్ లయన్ ఘంటమనేని బాబురావు జన్మదిన సందర్భంగా ఘనంగా నిర్వహించారు. సీనియర్ జర్నలిస్ట్ సి.ఆర్ జానకిరామ్ గౌడ్, లయన్ పచ్చిమట్ల మల్లేష్ గౌడ్ ల ఆధ్వర్యంలో ఆశాజ్యోతి డయగ్నాస్టిక్ సెంటర్ వద్ద భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ లయన్ ఘంటమనేని బాబురావు జన్మదిన వేడుకలు బర్త్ డే కేక్ కట్ చేసి కూడా ఘనంగా జరిపారు. తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక నిరుపేద అభాగ్యులకు, పేషెంట్లకు, వృద్ధ ఆశ్రమ వాసుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని



ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ జానకిరామ్, పల్లెర్ల రవీందర్, బుద్ధ భాగ్యరాజు, డాక్టర్ ప్రదీప్ సింహ, కుమ్మరి రమేష్, బలరాం రెడ్డి, డాక్టర్ అప్సర్, పుట్ట వెంకటేష్ డెకరేషన్, వంగ భాస్కర్ రెడ్డి క్యాటరింగ్, పల్లెర్ల బాలేష్ గుప్త, నీల ప్రవీణ్ , నేతి సాగర్, సి.అర్. ప్రవీణ్ గౌడ్, నాగరాజు గుప్త, మచ్చ యాదగిరి తదితరులందని ద్రాక్షగా గృహజ్యోతి

## పెద్దమ్మ ఆలయాన్ని కూల్చడం హిందువుల మనోభావాలను దెబ్బతీయటమే

**చట్టం న్యూస్ లింగంపేట్:** రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న పెద్దమ్మ ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూల్చేయడం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హిందువుల మనోభావాల దెబ్బతీయడమేనని బిజెపి మండల శాఖ అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశాడు మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ బంజారాహిల్స్ లో పెద్దమ్మ గుడిని కూల్చడం కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై పక్షపాత ధోరణితో వ్యవహరించడమేనని అన్నారు. బఫర్ జోన్లో ఉన్న ఎంఐఎం పార్టీ ఫాతిమా కళాశాలను హైడ్రా కూల్చకుండా సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ అడ్డుకుంటే మరి ఈరోజు హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా పెద్దమ్మ ఆలయాన్ని కూల్చడం హేయమైన చర్యఅని అన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఐఎం పార్టీ అసరుద్దీన్ అక్బరుద్దీన్ లకు కొమ్ముకాస్తుంది అనడానికి ఇదొక నిదర్శనం అన్నారు. కాలేజీలో పిల్లల భవిష్యత్తు ఇబ్బంది అవుతుందని కాలేజ్ ని కూల్చడం మానేసినప్పుడు మరి హిందువుల యొక్క మనోభావాలను దెబ్బతీసే విధంగా పెద్దమ్మ ఆలయాన్ని కూల్చడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు హిందువులంతా ఓట్లు వేసే ముందు ఆలోచించి వేయాలని వారు అన్నారు, పెద్దమ్మ ఆలయాన్ని ఉన్నచోటనే ప్రభుత్వం నిర్మించి ఇవ్వని ఎడల బిజెపి పార్టీ ఆధ్వర్యంలో హిందూ బంధువులతో మరియు పెద్దమ్మను కుల దైవంగా భావించే ముదిరాజులతో భారీ భారీ ర్యాలీలు నిర్వహించి కలెక్టర్ల ముట్టడి కార్యక్రమాలు చేపడతామని చెప్పి ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా మాజీ అధ్యక్షులు మహారాజుల మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాక్సనీ దత్తు రాములు,జిల్లా కౌన్సిల్ మెంబర్ వడ్ల రామచంద్ర చారి మండల ప్రధాన కార్యదర్శి ఆకుల విష్ణువర్ధన్, బీజేవైఎం మండల అధ్యక్షులు రజనీకాంత్ మండల ఉపాధ్యక్షులు కోల అల్లూరి, మరియు అనిల్ కుమార్, బూత్ అధ్యక్షులు గణేష్, మంగలి రవి, సున్నం రాజు తదితరులు పాల్గొన్నారు.




## వెల్లుట్లలో విద్యుత్ అవగాహన కార్యక్రమం



**చట్టం, ఎల్లారెడ్డి :** వర్షాకాలంలో జాగ్రత్తలపై సూచనలు చేసిన డీఈ విజయసారథి, ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామంలో బుధవారం రైతు పొలం బాట కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా డివిజనల్ ఇంజనీర్ (డీఈ) వై. విజయసారథి పాల్గొని, వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు సూచనలు అందజేశారు. తడిసిన స్టార్టర్ బాక్సులను తాకకూడదని, సమస్యలుంటే స్వయంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. అలాగే ఇనుప దండాలపై బట్టలు ఆరబెట్టేటప్పుడు విద్యుత్ తీగలకు దూరంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ నాగేంద్రప్రసాద్, ఏఈ వెంకటస్వామి, లైన్మెన్ కాశిరాం, అసిస్టెంట్ లైన్మెన్ రవీందర్ పాల్గొన్నారు.

## ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరిగితే తప్ప మున్సిపల్ అధికారులు స్పందించరా!



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్ పల్లి పట్టణ మున్సిపల్ అధికారుల పనితీరు పదుల సంఖ్యలో రహదారులపై ప్రతినిత్యం పశువులు రోడ్డును ఆక్రమించడం తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ఈమధ్య శుభవాడలో పదిమంది చిన్నారులను కుక్కలు గాయపరచడంతో మున్సిపల్ అధికారులు కేవలం ఆవార్డులోని కుక్కలనే పట్టుకుని వెళ్లారు ఇతర కాలనీ లలో కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నాయి ఆదర్శనగర్ రాంనగర్ ఏరియాలలో కోతులు ఇళ్లలో చొరబడి దొరికిన వస్తువులను దొరికినట్టు పట్టుకుపోవడం చిన్నపిల్లలపై వృద్ధులపై దాడి చేయడం నిత్యం ఏదో ఒక కాలనీలో జరుగుతుంది మెట్ పల్లి పట్టణంలో రహదారులపై నియంత్రణ లేని వాహన పార్కింగ్ లు తోపుడుబండ్ల రోడ్డు అక్రమణా వేరసి మెట్ పల్లి ప్రజలు ప్రతిరోజు పద్మవ్యూహాన్ని చేధిస్తున్నారు రైజింగ్ తెలంగాణ పేరుతో ఫోటోలకు దిగడం తప్ప ప్రజలు ఎన్నిసార్లు అధికారులకు చెప్పిన ప్రయోజనం మాత్రం శూన్యం, పశువుల యజమానులకు చెప్పాము అంటారే తప్ప చర్యలు మాత్రం శూన్యం, చర్యలు తీసుకొని మునిసిపల్ అధికారులు ఇకనైనా స్పందించి ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఇట్టి సమస్యలపై చర్యలు తీసుకోవాలని మెట్ పల్లి పట్టణ ప్రజలు వాహన దారులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఇలేగాం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు



**చట్టం, బైంసా :** నిర్మల్ జిల్లా భైంసా మండలం సిరాల ప్రాజెక్టు పూర్తి కావడంతో ఇలేగాం గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కు ధన్యవాదాలు తెలిపి, శాలువాతో సత్కరించారు. 9 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించి, ప్రాజెక్టును సత్వరం పూర్తి చేయించడంతో తమకు ఎంతో సంతోషంగా ఉందని హ ర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గంటకు పైగా ఎమ్మెల్యేతో గ్రామ సమస్యలపై చర్చ జరిగింది. పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణం ఎలా చేపట్టాలో రైతులకు దిశ నిర్దేశం చేశారు. రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని కలసికట్టుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. హనుమాన్ మందిర నిర్మాణం పూర్తి కావడంతో బిల్లులు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరగా, వారం రోజుల్లో హైదరాబాద్ వెళ్లి సమస్యను పరిష్కరిస్తానని చెప్పారు సంబంధిత ఇంజనీరింగ్ అధికారి లేకపోవడంతో బిల్లులో జాప్యంజరిగిందన్నారు. కొత్తచెరువుకు 25 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని, రెండు నెలల్లో పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అదేవిధంగా ఇలేగాం రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దశ లవారీగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా గ్రామానికి ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ తాజీ ఎంపిటిసి సర్పంచ్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఫ్యాక్స్ గోదాం ప్రారంభించిన ప్రభుత్వ విప్



**చట్టం రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి రైతుల గోదాం ను ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఏనుగు తిరుపతిరెడ్డి, కేడిసిసిబి పాలక వర్గ సభ్యులు, తూమ్ లక్ష్మి కాంత రావు, తోట రాజు, ఏరువా జశ్విత, కొండ వెంకటేశం, చెర్ల అమృత, దొబ్బల మల్లేశం, నల్ల సంజీవరెడ్డి, రొక్కం లచ్చిరెడ్డి, ఊట్కూరి సురేందర్ రెడ్డి, గుగులోతు భూలవ్వ, దొంతగోని రాజయ్య, సిద్ధం రమేష్, కాంగ్రెస్ రూరల్ మండల్ అధ్యక్షుడు వకుల వర్ధం శ్రీనివాస్, కాంగ్రెస్ నూకల మర్రి గ్రామ కమిటీ అధ్యక్షులు పాలకుర్తి పరుశరాములు, సంగ స్వామి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, కరుణాకర్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీ బొడ్డు శంకరవ్వ రాములు, రోమాల ప్రవీణ్, డైరెక్టర్ ఆకుల దేవరాజం, మహిళలు, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జన సురక్ష పథకాలు సేవలపై అవగాహన సదస్సు




**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం ఘనపూర్ గ్రామమంలో జన సురక్ష పథకాలపై , యు బి ఐ బ్యాంకు సేవలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం.ఈ సదస్సు లో బ్యాంకు సి ఎఫ్ ఎల్,కౌన్సిలర్ బుర్ర సాగర్ మాట్లాడినారు. ప్రతి ఒక్కరు బ్యాంకులో అకౌంట్ కలిగి ఉండాలి జీరో అకౌంట్ (పీఎంజేడీ) గురించి వివరించారు. అలానే భీమా చేసుకోవాలి ధీమాగా ఉండాలి అని ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన సంవత్సరానికి 436రూ,తో సహజ మరణం ద్వారా 2లక్షలు, ప్రధాన మంత్రి సురక్ష భీమా ద్వారా 20,రూ తో ప్రమాద వశత్తుగా మరణిస్తే 2లక్షలు భీమా వస్తుంది అన్నారు, అటల్ పెన్షన్ యోజనలో 18 నుండి 40సంవత్సరాల చేరి వయసు తగిన ప్రీమియం చెల్లిస్తే 60సంవత్సరం నుండి 1000రూ నుండి 5000/రూ పెన్షన్ తీసుకోవచ్చు తెలియజేసారు. యు బి ఐ బ్యాంకు సేవలు వినియోగించువాలి క్రాప్ లోన్స్, మహిళ సంఘాల రుణాలు డిపాజిట్, గోల్డ్ లోన్స్,డైరీఫ్రామ్, కోళ్ల ఫ్రామ్, గొర్రెలు పెంపకం, ట్రాక్టర్, హార్వెస్టర్ మొదలగు రుణాలు గురించి వివరించారు. సైబర్ నేరాలపై ఖాతా దారులు అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ఈ సదస్సులో ముఖ్య అతిధులు గా ఎల్డిఎంఏ తిరుపతి భూపాలపల్లి, బ్యాంకు మేనేజర్ సి ఎస్ ఎల్, కౌన్సిలర్స్ బుర్ర సాగర్ఎల్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వానరునికి సాంప్రదాయంగా అంతక్రియలు



**చట్టం, ముథోల్ :** నిర్మల్ జిల్లా ముథోల్ మండల కేంద్రం లోని కాల్వగల్లి లో బుధవారం అనారోగ్యంతో వాన దేవత మృతిచెందగా హిందూ వాహిని కార్యకర్తలు గల్లి వాసులు కలసి కాల్వగల్లి హనుమాన్ మందిరం పక్కన ఇందు ధర్మ సాంప్రదాయ పద్ధతిలో వాన దేవునికి ప్రత్యేక పూజలు చేసి దైవంతో సమానం పోల్చే వానరునికి గ్రామస్తులు అంత క్రియలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూ వాహిని కార్యకర్తలు రాకేష్, గణేష్, శంకర్, గోసుల రాజు, సారతి పోషెట్టి మరియు బిజెపి మాజి ఎంపిటిసి దేవుజి భూమేష్ తదితరులు పాల్గొన్నారు

## పోలీస్, రెవిన్యూ శాఖల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం



**చట్టం, తూప్రాన్:** మనోహరాబాద్ మండలంలోని రామాయిపల్లి గ్రామంలో "సివిల్ హక్కుల దినోత్సవం" సందర్భంగా పోలీస్ శాఖ మరియు రెవిన్యూ అధికారుల సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ ప్రజలకు సివిల్ హక్కులపై అవగాహన కల్పిస్తూ, భారత రాజ్యాంగంలోని మౌలిక హక్కులు, ప్రాధాన్యత మరియు వాటి పరిరక్షణ గురించి కూలంకషంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ హక్కులను తెలుసుకోవడం, దుర్వినియోగాన్ని తిప్పికొట్టడం ఎంత ముఖ్యమో స్పష్టం చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొని, ప్రశంసలు అందించారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని అక్కడకు వచ్చిన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహరాబాద్ ఎస్.ఐ సుభాష్ గౌడ్, ఏఎస్ఐ శ్రీనివాస్, రెవిన్యూ ఇన్స్పెక్టర్ దీక్షిత్, రెవెన్యూ పోలీసు సిబ్బంది మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

